



మిరప పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

'మిరప'కు గిట్టుబాటు ధర కల్పించాలి


ఎకరాకు రూ. లక్ష నష్టపరిహారం ఇవ్వాలి : ఏపి రైతు సంఘం

ప్రజాశక్తి-ఉరవకొండ

మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘం బృందం బుధవారం రా కూడేరు మండలంలోని ముద్దలాపురం గ్రామంలో పర్యటించి మిరప సాగు చేసి నష్టపోయిన రైతులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ధర లేక రైతులు రెండేళ్లుగా ఏసీ గోడౌన్‌లో మిరప పంటను నిల్వ చేసుకున్నారని, వారు కనీసం గోడౌన్ బాడుగ చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించకుండా రైతులను మోసం చేస్తుంద న్నారు. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి వల్ల మిరప పంట పూర్తిగా దెబ్బతిని పెట్టుబడులు కూడా దక్కలేదని, దీంతో అప్పులు ఎలా కట్టాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం క్వింటా రూ. 50 వేలతో కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. లక్ష పంట నష్ట పరిహారం ఇవ్వాలని, గోడౌన్ల బాడుగలను చెల్లించి మిరప రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాస మండల కార్యదర్శి కరీం, రైతు సంఘం నాయకులు ఈరప్ప, వెంకటేశులు, నాగాయపల్లి, మల్లికార్జున, రైతులు చిన్న ఆంజనేయులు, నరేష్, బాలరాజు, నాగరాజు, రామాంజి, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనానికి ఊతమిదేనా..?

అనంతపురం జిల్లా అభివృద్ధిలో కీలకం ఉద్యానవన పంటలని ప్రభుత్వం పెద్దఎత్తున చెబుతోంది. అందుకే ఈ జిల్లా ఉద్యానవన హబ్‌గానే కాకుండా ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారుస్తామని నేతలు ప్రకటిస్తున్నారు. ఉద్యానవన శాఖకు ఈ ఏడాది ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు చూస్తే 'మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు గడపదాటడం లేదన్న' నానుడి ఆచరణలో అద్దం పడుతోంది.





రూ.13.03 కోట్లు మంజూరు

విడుదలైంది రూ.1.89 కోట్లు

ఏటా 25 శాతం అభివృద్ధి సాధ్యమా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు రూ.13.03 కోట్లు. ప్రధానంగా మూడు పథకాల కింద ఉద్యానవన శాఖకు నిధులు కేటాయిస్తారు. ఇందులో సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం (ఎంఐడిహెచ్) కింద రూ.10.41 కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.1.51 కోట్లు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) కింద కేటాయించింది. రూ.1.58 కోట్లు అయితే ఖర్చు చేసింది సున్నా కావడం గమనార్హం. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఆయిల్‌పామ్, బాంబూ మిషన్‌కు రూ.1.03 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది రూ.37.81 లక్షలు. ఈ మూడు పథకాలకు కలిపి అనంతపురం జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు రూ.13.03 కోట్లు, ఇందులో ఇప్పటి వరకు ఖర్చు పెట్టిన నిధులు చూస్తే రూ.1.89 కోట్లు మాత్రమే. కేటాయించిన దాంట్లో ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు కేవలం 5.5 శాతం నిధులు మాత్రమే కావడం గమనార్హం. మరో మాసంతో ఈ ఆర్థిక సంవత్సరమే ముగియనుంది. ఒక్క నెలలోపు తక్కిన నిధులు కేటాయించడం, వినియోగించడం ఏ మేరకు సాధ్యమన్నది చూడాల్సి ఉంది.

డ్రిప్‌దీ అదే పరిస్థితి

ఉద్యానవన పంటల అభివృద్ధిలో డ్రిప్ కీలకమైంది. ఇదైనా లక్ష్యానికి అనుగుణంగా నడుస్తోందా అంటే అదీ లేకుండా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 37,500 హెక్టార్లకు అనుమతి వచ్చింది. దీని కోసం ఇప్పటి వరకు 39,170 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. దీని విస్తీర్ణంలో చూసినప్పుడు 52,736 హెక్టార్లలో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఆమోదం తెలిపిన వరకే చూస్తే 20,530 రైతులకు సంబంధించి 24,980 హెక్టార్లకు ఇచ్చారు. ఇప్పటి వరకు మంజూరైనవి చూస్తే 9392 హెక్టార్లకే ఉంది. ఇంకా పెద్దఎత్తున జరగాల్సి ఉంది.

25 శాతం వృద్ధి సాధ్యమేనా ?

అనంతపురం జిల్లాలో ఏటా 25 శాతం ఉద్యానవన పరిధిలో అభివృద్ధి సాధిస్తామని ఇటీవల అనంతపురం నగరంలో నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రకటించారు. ఇప్పుడు ఏటా వస్తున్న దిగుబడులు 25 లక్షల టన్నులను 29 లక్షల టన్నుల దిగుబడి తీసుకెళతామని ప్రకటించారు. రైతుకు ఊతమందకుండా 25 శాతం వృద్ధి ఎలా సాధ్యమని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా మార్కెటింగ్ సౌకర్యం లేకుండా విస్తరణ ఎలా సాధ్యమని అడుగుతున్నారు. మార్కెటింగు మౌలిక సదుపాయల కల్పనకు ఈ ఏడాది జిల్లాకు కేటాయించిన రూ.1.42 కోట్లలో ఒక్క రూపాయి నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఇప్పటికే ఉద్యానవన పంటలను పండించిన రైతులు పంటను అమ్ముకోలేని పరిస్థితులున్నాయి. తాజాగా మిరప రైతు ధరలేక గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యావన పంటలను ప్రోత్సహిస్తామన్న దానిలో వాస్తవికత ఎంతన్న ప్రశ్నలు రైతుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి.







బుక్కరాయసముద్రంలో జరుగుతున్న రథోత్సవం   అఖండ జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

కొండమీదరాయుడు రథోత్సవం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం కొండమీద రాయుడు రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. బుక్కరాయసముద్రం పురవీధుల గుండా, అశేష భక్తుల మధ్య గోవింద నామస్మరణలో రథోత్సవాన్ని నిర్వహించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో పాల్గొనేందుకు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కొండమీద ఉన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిఐ కరుణాకర్, పోలీసులు డ్రోన్ కెమెరాలతో బందోబస్తు నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్‌లో శెట్టిపల్లి శశిధర్‌రెడ్డి ప్రతిభ



శశిధర్‌రెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి శశిధర్‌రెడ్డి జేఈఈ మెయిన్స్‌లో 99.97 పర్సంటేజీ సాధించి ప్రతిభ చాటాడు. విద్యార్థి తండ్రి శెట్టిపల్లి నరసింహారెడ్డి వ్యవసాయం చేసేవాడు. తల్లి రమణమ్మ జబుకలపల్లి ఎంపిపి స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వారి కుమారుడు శశిధర్‌రెడ్డి 1 నుంచి పదో తరగతి వరకూ అనంతపురంలోని నారాయణ స్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లోని మాదాపురం నారాయణ కాలేజీలో చదివాడు. ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్‌లో 99.97 పర్సంటేజీ సాధించి ఆల్ ఇండియాలో స్థాయిలో 250వ ర్యాంకు సాధించాడు. శెట్టిపల్లి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ జెఈఈ అడ్వాన్స్ ఎంట్రెన్స్‌లో మంచి మార్కులు సాధించి బాంబే ఐఐటిలో సీటు సాధించడమే లక్ష్యం అన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు నరసింహారెడ్డి, రమణమ్మ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

హాకీ రాష్ట్ర జట్టుకు పాల్తూరు పీడీ ఎంపిక



పీడీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకూ కాకినాడలో జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు విడపనకల్లు మండలంలోని పాల్తూరు జడ్పీ హైస్కూల్ పిడి శ్రీనివాసులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. గత నవంబర్‌లో విజయవాడలో నిర్వహించిన సెలక్షన్స్‌లో శ్రీనివాసులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఆయనను హెచ్ఎం సర్వమంగళ, ఉపాధ్యాయ బృందం అభినందించారు. శ్రీనివాసులు గతంలో కూడా పలుమార్లు రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించారు.

బళ్లారి-గుండ్లపల్లి రోడ్డును జాతీయ రహదారిగా మార్చండి

కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శికి ఎంపిలు, విప్ వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

బళ్లారి-ఎన్.గుండ్లపల్లి ప్రధాన రోడ్డును జాతీయ రహదారిగా గుర్తిస్తూ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎంపిలు అంబికా లక్ష్మినారాయణ, బికె.పార్థసారధి, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఢిల్లీలోని కేంద్ర రవాణా శాఖ కార్యాలయంలో కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉమాశంకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కర్నాటక, ఆంధ్ర ప్రాంతాలను కలిపే 52 కిలోమీటర్ల పొడవైన ఈ అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు. అలాగే 150-ఎ జాతీయ రహదారిపై డి.హీరేహాల్‌లో బ్రిడ్జి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం చెపుతున్నారని ప్రజల వినతి మేరకు బాక్స్ బ్రిడ్జి బదులు ఫ్లై ఓవర్ నిర్మించేలా డిజైన్‌లో మార్పు చేయాలని కోరారు. రెండు సమస్యలకు త్వరలో తప్పక పరిష్కారం లభిస్తుందని కాలవ శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.



వినతిపత్రం అందిస్తున్న ఎంపీలు, విప్



జెఎన్‌టియు విసితో మాట్లాడుతున్న టిసిఎస్ ప్రతినిధి

సామాజిక బాధ్యతపై అవగాహన

ప్రజాశక్తి -అనంతపురం

జెఎన్‌టియు విద్యార్థులకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చేందుకు ప్రముఖ టిసిఎస్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. ఈమేరకు బుధవారం ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.క్రిష్ణయ్యను టిసిఎస్ కార్పొరేషన్ ప్రతినిధి శ్రీనివాసన్ విశ్వనాథలు కలిశారు. ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సోషియల్ రెస్పాన్సిబులిటీ కింద శిక్షణ ఇచ్చే కార్యక్రమంపై చర్చించారు. కార్యక్రమం నిర్వహణకు అనుమతి వచ్చిన తర్వాత దీనిని నిర్వహించేలా జెఎన్‌టియు అధికారులు అవగాహనకు వచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్‌వి.సత్యనారాయణ, అకడమిక్ అడిట్ డైరెక్టర్ బి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలో సహకార సంఘం ఎడిసిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పి పెట్రోల్ బంక్ రికార్డులను సేల్స్ మేనేజర్ వెంకటేష్ బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ హిందూస్తాన్ ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో హెచ్‌పి, పే స్కానర్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ స్కాన్ ద్వారా రూ.100 పెట్రోల్, డీజిల్ లావాదేవీలు నిర్వహిస్తే మూడు రూపాయల క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉందన్నారు. మార్చి 31వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ వీరనారప్ప సిబ్బంది రమణ పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తాం

జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

'జిల్లా వైసిపిలో ఎలాంటి విభేదాలు లేవు.. అందరం కలిసి సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం' అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం వైసిపిలో చేరిన కాంగ్రెస్ మాజీ మంత్రి శైలజానాథ్, శింగనమల వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులుతో నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్ నేతృత్వంలోని వైసిపి పనిచేస్తుందన్నారు. కూటమి హామీల అమలు కోసం పోరాటాలు చేస్తామన్నారు. కూటమి పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం పని చేస్తున్నా యని విమర్శించారు. శైలజానాథ్ మాట్లాడుతూ ప్రజల్లో భయాలు రేకెత్తించకుండా పోలీసులను సమాజశ్రేయస్సుకు వినియోగించాలని సూచించారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రజా పోరాటాలు చేస్తామన్నారు. అప్పట్లో వామపక్షాలు, కాంగ్రెస్ పోరాటంతో జిల్లాకు మెడికల్ కళాశాల కేటాయించారని, నేడు మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రశ్నిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీలు అమలు చేయించాలని డిమాండ్ చేశారు. సాంబశివారెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలుకు పోరాటాలు చేపడతామని, అందరం సమిష్టిగా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో రెండు ఎంపి, పద్నాలుగు అసెంబ్లీ సీట్లు గెలుస్తామని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

వేసవిలో తాగునీటి సమస్య రానివ్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరానికి వేసవిలో తాగునీటి సమస్య రానివ్వకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన పీఏబీఆర్ జలాశయం, ముద్దలాపురం పంపు హౌస్‌ను కార్పొరేషన్ కమిషనర్ బాలస్వామి, ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు రాధాకష్ణ, నరసింహులతో కలిసి పరిశీలించారు. పిఎబిఆర్ జలాశయంలో నీరు ఎంత మేర ఉంది, ముద్దలాపురం వాటర్ ప్లాంట్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో వేసవి వచ్చిందంటే నగరానికి తాగునీటి సమస్య ఉండేదన్నారు. సరైన నిర్వహణ లేక లీకేజీలు, మోటార్ల మరమ్మతులు ఉండేవని తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు అలాంటి ఇబ్బందులు రానీవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరానికి ప్రస్తుతం ఉన్న 61 ఎంఎల్‌డి ప్లాంట్‌తో పాటు అదనంగా మరో 16 ఎంఎల్‌డి వాటర్ ప్లాంట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇక నుంచి నగరంలో రెండు రోజులకు ఒకసారి వచ్చే కాలనీల్లో కూడా ప్రతిరోజూ నీరు సరఫరా అవుతుందన్నారు. ప్రస్తుతం రెండు మోటార్లు నిరంతరాయంగా పని చేస్తున్నాయని అవి ఎలాంటి సమయంలో అయినా మరమ్మతులకు గురైతే, అదనంగా మరో రెండు మోటార్లు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 3.5 టిఎంసిల నీరు ఉందని, నగరానికి 1 టిఎంసి నీరు సరిపోతుందన్నారు. మినరల్ వాటర్ పేరుతో కల్తీ నీటిని విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాంజినేయులు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు కొనంకి గంగారామ్, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, పావురాల శేఖర్, టీడీపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



పిఎబిఆర్‌లో నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

'ఆ విఆర్వో ఎవరో నాకు తెలియదు'..!

ఆరోపణలు చేసిన మహిళ కుమార్తె వీడియో ప్రకటన

ప్రజాశక్తి-తాడిపత్రి

తన కూతురి పట్ల తాడిపత్రి 35వ వార్డు వీర్వో అసభ్యంగా ప్రవర్తించాడంటూ అదే పట్టణానికి చెందిన ఓ మహిళ నాలుగు రోజుల క్రితం ఓ వీడియో విడుదల చేసింది. తాజాగా ఈ వివాదంపై ఆరోపణలు చేసిన మహిళ కుమార్తె బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందులో తనకు ఆ వీఆర్వో ఎవరో తెలియదని, మా అమ్మ చేత ఎవరో కావాలనే మాట్లాడించారంటూ అందులో పేర్కొనడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తాడిపత్రి 35వ వార్డుకు చెందిన నాగ మునెమ్మ, ఆమె కూతురు లక్ష్మి, మనవరాలుతో కలిసి పట్టణంలోని నందలపాడులో నివాసం ఉంటోంది. తన కూతురికి రేషన్ కార్డు ఇప్పించాలంటూ ఇటీవల వీఆర్వోను కోరగా ఆయన అసభ్య పదజాలంతో మాట్లాడారంటూ నాగ మునెమ్మ శనివారం నాడు ఓ వీడియోలో పేర్కొంది. ఈ వీడియో వైరల్ కావడంతో స్పందించిన అధికారులు వీఆర్వోకు షోకాజ్ నోటీసు ఇవ్వడంతో పాటు బదిలీ చేశారు. కొందరు కావాలనే తనను ఇబ్బంది పెట్టేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వీఆర్వో ఇప్పటికే తెలియజేశారు. ఇదిలా ఉండగా నాగ మునెమ్మ కూతురు లక్ష్మీ తనకు వీఆర్వో ఎవరో తెలియదని, ఆయనను ఎప్పుడూ చూడలేదంటూ బుధవారం ఓ వీడియో ప్రకటన విడదల చేశారు. తన అమ్మ చేత కొందరు బలవంతంగా అబద్దాలు మాట్లాడించారని అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ ఘటన పూర్వాపరాలు ఏమిటన్న దానిపై పట్టణంలో సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. ఏది ఏమైనా ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

నేటి నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు



సంత్ సేవాలాల్ మహారాజ్

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సేవాఘడ్‌లో వెలసిన బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ 286వ జయంత్యుత్సవాలు, మాతా జగదాంబదేవి ఆలయ 9వ వార్షికోత్సవం గురువారం నుంచి జరగనున్నాయి. ఏటా ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో సేవాలాల్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తారు. ఎపితో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి బంజరాలు తరలివస్తారు. 13వ తేదీ సేవాలాల్ మహారాజ్, మాతా జగదాంబదేవి ఆలయల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. 14న సాయంత్రం సేవాలాల్ ప్రతిమ ఊరేగింపు, అదే రోజు రాత్రి ఆలయ ప్రాంగణంలో జ్యోతిని వెలిగించడంతో జయంత్యుత్సలు ప్రారంభమవుతాయి. బంజారా లను ఉద్దేశించి సభను ఏర్పాటు చేసి ప్రసంగిస్తారు. సేవాలాల్ మాలధారులు ఆలయంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. 15న తెల్లవారుజామున 101 మంది బాలికలతో మాతా జగదాంబదేవి ఆలయం వరకూ ప్రదర్శన, అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు సేవాలాల్ ఆలయం ఎదురుగా మహాభోగ్ కార్యక్రమం నిర్వహిస్తారు. భక్తులు సేవాఘడ్‌కు చేరుకునేందుకు గుత్తి, గుంతకల్లు ఆర్టీసీ డిపోల నుంచి అధికారులు బస్సులు ఏర్పాటు చేశారు.

ఎస్‌కెయులో 'సే నో టు డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

'మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకృష్ణ దేవరాయ విశ్వద్యాలయంలోని ఔషధ కళాశాలలో విసి ప్రొఫెసర్ బి.అనిత 'సే నో టు డ్రగ్స్' పోస్టర్‌ను విడుదల చేశారు. విసి అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ ఇ.రమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రతి డిపార్ట్‌మెంట్ ముఖ ద్వారంలో పోస్టర్లను అతికించాలని తెలిపారు. కార్యక్రమంలో ఔషధ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.వెంకటరమణ, ప్రిన్సిపల్ డాక్టర్ జి.సోమశేఖర్, ఎనఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్యసౌమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఔషధ కళాశాల విసి

కేంద్రం మోసాలపై ప్రజల్ని చైతన్యం చేద్దాం : వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్రంలోని బిజెపి సర్కారు విడుదల చేసిన బడ్జెట్ మోసాలపై ప్రజల్ని చైతన్యం చేద్దామని వామపక్ష పార్టీలు నేతలు పిలుపునిచ్చారు. పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో బుధవారం సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల నాయకులుతో సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బి.సురేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, పేదలు, కార్మికులు, కర్షకులకు వ్యతిరేకంగా ఉందన్నారు. రాయలసీమ అభివృద్ధికి ఏమాత్రం నిధులు కేటాయిం చలేదన్నారు. అనంతపురం జిల్లాకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ కోరగా ఫలితం లేదన్నారు. రైతులకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. విద్య, వైద్యం, 'ఉపాధి హామీ' చట్టాలను నిర్వీర్యం చేసే దిశగా బడ్జెట్ కేటాయింపు ఉందన్నారు. రైల్వే జోన్ రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరగా విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయడం దారుణం అన్నారు. జిల్లాలోని సెంట్రల్ యూనివర్సిటీ, కుదిరేముఖ్ ఉక్కు పరిశ్రమ, ఎయిమ్స్ తరహా ఆసుపత్రి హామీలను విస్మరించిందన్నారు. గిరిజనులు, దళితులు, చేతివృత్తిదారుల అభివృద్ధికి బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాల ఊసే లేదన్నారు. వీటన్నింటిపై నెల 14 నుంచి 20 తేదీ వరకూ క్షేత్రస్థాయిలో వీధి వీధినా ప్రజల్లోకి వెళ్లి చైతన్యం కల్పించి కేంద్రం మోసాలను ఎండగడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి హెచ్ఎం.మారుతిప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు రామునాయక్, సూరి, బి.జ్యోతి, షబ్బీర్, చంద్ర, సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పట్టణ నాయకులు సత్తార్, బాషా, రాందాస్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఉద్యానవన పంటలను సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులను ఉద్యానవన పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులు తప్పనిసరిగా ప్రతి నెలా రెండవ బుధవారం జరిగే ప్రైమరీ సెక్టర్ సమీక్ష సమావేశంలో పాల్గొని వారి పరిధిలో జరిగిన అన్ని కార్యక్రమాలనూ తెలియజేయాలన్నారు. జిల్లాలో కనీస మద్దతు ధరతో కంది పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జొన్న, పప్పుశనగ, వేరుశనగ పంటలను కనీస మద్దతు ధరతో కొనుగోలుకు అనుమతి తీసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు చేసిన ఫలితాలను తెలియజేసే సాయిల్ హెల్త్ కార్డులను వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమంలో రైతులకు అందజేసి ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కౌలు రైతులు గుర్తించి కౌలుదారున్ని హక్కు పత్రం ఇచ్చి వారికి ప్రభుత్వం నుంచి వచ్చేటువంటి పథకాలు అమలు చేయాలన్నారు. నెలలోపు పంట రుణాలనూ ఇప్పించాలన్నారు. ఎపిఎమ్ఐపి ద్వారా రాయితీపై బిందు సేద్య పరికరాలను ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమం నందు ఎంఒయులు చేసిన కంపెనీ ఆ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి కంపెనీలతో మాట్లాడి జిల్లాలో వారి కార్యక్రమాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖలో అమలవుతున్న అన్ని రకాల పథకాలను పాడి రైతులకు అందించాలన్నారు. అనంతరం ఉద్యాన శాఖ 2025 డైరీ, ప్లాంట్ డాక్టర్స్ డైరీ 2025ను, ఏపీ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఫిషరీస్ డిడి శ్రీనివాస్ నాయక్, డిసిఒ అరుణకుమారి, ఏపీ మార్క్‌ఫెడ్ ఏడీ పెన్నేశ్వరి, ఆత్మ పీడీ మద్దిలేటితో పాటు వివిధ శాఖల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



ఉద్యాన శాఖ 2025 డైరీ, ఏపీ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వైభవంగా రంగనాథస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి రథోత్సవాన్ని అశేష భక్తజనం మధ్య బుధవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి కళ్యాణం కమనీయంగా జరిగింది. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పూజలు నిర్వహించి రథాన్ని లాగి రథోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించడానికి ఎపితోపాటు కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. సమీప గ్రామాల భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించుకొని తండోప తండాలుగా తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో పలు దుకాణాలు వెలిశాయి. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.ఆదిశేషనాయుడు, ఆలయ కార్య నిర్వహణఅధికారి సి.రామాంజనేయులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారు. మాణిక్య రంగనాథస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు సమారాధన నిర్వహించి, ఓఆర్ఎస్ డ్రింక్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, నారాయణస్వామి, శ్రీనివాసులు, నారాయణ, ఎంకె.చౌదరి, బి.చిన్నరెడ్డి యాదవ్, బి.రంగస్వామి రెడ్డి యాదవ్, రామచంద్రయాదవ్, డేగ మద్దిలేటి, ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్ష, కార్యదర్శులు జీవీ.రామన్, జయవరం అశ్వర్థ రంగయ్య, కన్‌స్ట్రక్షన్ కార్యదర్శి రామరంగయ్య, సభ్యులు ముత్యాల రంగస్వామి, కె.కిషోర్‌బాబు, కె.సుదర్శన్, ప్రధాన అర్చకులు అన్నదానం ఆదిశేషయ్య, అన్నదానం రాఘవేంద్ర ఆచార్యులు, చెరుకూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బొలికొండ రంగనాథస్వామి రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం

రాయదుర్గం రూరల్ : మండలంలోని మల్లాపురం సమీపంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి 29వ బ్రహ్మ రథోత్సవం అశేష భక్తజన సందోహం మధ్య వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు ఆడియాన్ రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యం, వేదపండి తులు హరి ప్రసాద్ లక్ష్మీనరసింహస్వామి ప్రత్యేక పూజలు చేసి అనంతరం రథంలో కొలువు దీర్చారు. కణేకల్లు మండలంలోని గెణిగెర గ్రామ ప్రజలు అన్నదానానికి విరాళం ఇచ్చారు. ఆర్ఎంపిల ఆధ్వ ర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు కాలవభరత్, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, పాటిల్ సదాశివరెడ్డి, నరేష్‌రెడ్డి, వీరేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి నర్సింహులు, ఉపకోశాధికారి సత్యనారాయణ, అకౌంటెంట్ వెంకటేశులు, కార్యదర్శి గురురాఘవేంద్ర ప్రసాద్, ప్రచార కార్యదర్శి కమలాక్షుడు, సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, తిమ్మారెడ్డి, నరసింహులు, పాల్గొన్నారు.



అపోలోలో మందులు అందజేస్తున్న బద్దేనాయక్

బద్దేనాయక్ దాతృత్వం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

లివర్ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ రెండేళ్లుగా ప్రతి నెలా రూ. 12 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తున్నారు. వివరాలు.. మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన మహేంద్ర కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండేళ్ల క్రితం మీ సేవా బాబు బద్దేనాయక్‌ను కలిసి మహేంద్ర మందులకు నెల నెలా రూ.12వేలు ఖర్చు అవుతుందని వివరించాడు. అలాగే మహేంద్ర కుటుంబ సభ్యుల విన్నపం మేరకు బద్దేనాయక్ ప్రతి నెలా మందులకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు గత రెండేళ్లుగా మహేంద్రకు నెల నెలా రూ. 12 వేల విలువ చేసే మందులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక అపోలో ఫార్మసీలో ఫార్మసీ సిబ్బంది చేత బద్దేనాయక్ మహేంద్రకు మందులు అందజేశారు.

వారంలో పైపులైన్ మరమ్మతులు

ప్రజాశక్తి-యాడికి

యాడికి పంచాయతీలోని పిన్నేపల్లి లేఅవుట్, పిన్నేపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొన డంతో బుధవారం టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ దేవకుమార్, పంచాయతీ సెక్రటరీ శోభారాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పర్యటించి పైపులైన్లను పరిశీలించారు. వాటి స్థానంలో పంచాయతీ నిధులతో వారంలో కొత్త పైపులైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వారి వెంట తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠా రెడ్డి, పిన్నేపల్లి సాగునీటి సంఘం అధ్యక్షులు విశ్వేశ్వరరావు, సూర్యనారాయణ ఉన్నారు.

కోన ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-యాడికి

మహాశివరాత్రి పర్వదినాన మండలంలోని కోనఉప్పలపాడు సమీపంలో వెలసిన కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే తిరుణాల ఏర్పాట్లను బుధవారం టిడిపి సీనియర్ నాయకులు చవ్వా గోపాల్ రెడ్డి పరిశీలించారు. ఆయన కోన ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు సిమెంటు రోడ్డు, కోనేరుకు నూతన గేట్లు, మరమ్మతుల ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట సత్యనారాయణరెడ్డి, బద్దెల రాముడు, రామకృష్ణ, సర్పంచి రామాంజనేయులు, గండికోట లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ గాంధీ ఉన్నారు.

రైతులకు యూనిక్ నెంబర్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే 11 అంకెల యూనిక్ నెంబర్ ఎంతో అవసరమని మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 11 అంకెల యూనిక్ నెంబర్‌ను కేటాయిస్తున్నాయన్నారు. రైతులు ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి సంబంధిత రైతు సేవా కేంద్రం, లేదా మీ సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు.

రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

పుట్లూరు : సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 15వ తేదీ వరకూ పొడిగించినట్లు ఎంపీడీవో అలివేలమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 35 యూనిట్లు మంజూరు కగా బీసీలకు 28, కాపులకు 7 కేటాయించారన్నారు. వీటిలో రూ. 2 లక్షలు, రూ. 3 లక్షలు, రూ. 5 లక్షలు లోన్లు ఉన్నట్టు తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఎల్లుట్ల గ్రామపంచాయతీలో జరుగుతున్న నీటి నిల్వ కందకాల పనిని బుధ వారం ఎపిఒ నరేంద్ర పరిశీలించారు. ఆయన ముందుగా మాస్టర్ వెరిఫికేషన్ చేసి అనంతరం కులీలతో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ. 250 నుంచి రూ. 300 కూలి పడుతుందని, ఆవిధంగా పని చేయాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఒ నరేంద్ర

రేషన్ తూకాల్లో అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రాయదుర్గం

రేషన్‌షాపుల్లో నిత్యావసర సరుకుల తూకాల్లో అవకతవకలను అరికట్టాలని సిపిఎం నాయకులు రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులను కోరారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద బుధవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, నాగరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేషన్ డీలర్లు నిబంధనలు పాటించడం లేదని, తూకాల్లో 30 శాతం దాకా సరుకులు తక్కువగా వేస్తున్నారని రేషన్‌కార్డు దారులు తమ వద్ద వాపోతున్నారన్నారు. అక్రమంగా మిగుల్చుకున్న బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా అధికారులు చౌక దుకాణాలను తనిఖీ చేయడం లేదన్నారు. కనీసం రెండు నెలలకు ఓసారైనా ఫుడ్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. చౌక దుకాణాల్లో అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు మధు, రమేష్, తిమ్మరాజు, అంజి, శంకర్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వంశీకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌కు సాగు నీరివ్వాలి

ప్రజాశక్తి-కుందుర్పి

కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌కు బిటిపి నుంచి సాగునీరు తెచ్చేలా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవ చూపాలని కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ గొల్ల బొజ్జప్ప డిమాండ్ చేశారు. సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు గౌని తిప్పేస్వామి నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బొజ్జప్ప మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నియోజవర్గ ప్రజల నీటి కష్టాలు తీర్చిన ఘనత రఘువీరారెడ్డికి దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే కుందుర్పి బ్రాంచ్ కెనాలకు సాగునీరు తెచ్చేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర రామాంజనేయులు, హనుమంతరెడ్డి, చంద్ర, కరి యప్ప, చిక్కన్న, గంగప్ప, ఆంజనేయులు, డి. రామాంజనేయులు, హనుమంత రాయుడు, మారుతి, తిప్పేస్వామి, గోపాల్, ఈరన్న, రామన్న, చిత్తప్ప, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

సరికొత్త పరిజ్ఞానంతో గుండెలో బ్లడ్ క్లాట్స్ తొలగింపు

కిమ్స్ సవేరాలో ఇద్దరికి చికిత్స

ప్రజాశక్తి- అనంతపురం

గుండె రక్తనాళాలు పూర్తిగా రక్తం గడ్డలతో పూడుకుపోయి, గుండెపోటు వచ్చిన 24 గంటల తర్వాత వచ్చిన ఇద్దరు రోగులకు కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు సరికొత్త, అత్యాధునిక పరిజ్ఞానంతో ప్రాణదానం చేశారు. రాయలసీమలో ఈ సరికొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించి చికిత్స చేయడం ఇదే ప్రథమం. ఆ వివరాలను ఆసుపత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ జి.ప్రదీప్‌కృష్ణ బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాలకు చెందిన ఇద్దరు 45 ఏళ్ల పురుషులు గుండె జబ్బులతో ఇటీవల ఆసుపత్రిలో చేరారు. వారికి వైద్య పరీక్షలు చేయగా గుండె రక్తనాళాలు పూర్తిగా రక్తం గడ్డలతో పూడుకుపోయాయని తేలింది. వెంటనే వైద్యులు 'పెనంబ్రా కాట్ ఆర్ఎక్స్' అనే సరికొత్త, అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చికిత్స చేసి రక్తం గడ్డలు తొలగించాం. ఒక వ్యక్తికి స్టెంట్ కూడా వేయాల్సిన అవసరం రాలేదు. మరొక వ్యక్తికి రక్తం గడ్డలు తొలగించిన తర్వాత కూడా 70 శాంతం బ్లాక్ ఉండడం వల్ల స్టెంట్ వేయాల్సి వచ్చింది. ఇద్దరూ పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశామన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి చేద్దాం : మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

వైసిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. విడపనకల్లు మండల నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కురుబ రమేష్ బుధవారం మండల నాయకులతో కలిసి అనంతపురంలోని ఆయన నివాసంలో విశ్వేశ్వరరెడ్డి, ఆయన తనయుడు ప్రణయ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రమేష్‌ను విశ్వ సమక్షంలో పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రమేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ నాయకులు, అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కరణం భీమ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, గిరిబాబు, సుంకన్న, యువరాజు, జనార్దన్‌రెడ్డి, డిష్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



వైసిపి మండల అధ్యక్షుడు రమేష్‌ను సన్మానించిన విశ్వ

'వడ్డీ పేరుతో కానిస్టేబుల్ వేధింపులు' : బాధితులు

ప్రజాశక్తి-అనంతపురం

ఓ మహిళా కానిస్టేబుల్ వడ్డీ పేరుతో భర్తతో కలిసి తమను మానసిక వేదనకు గురి చేస్తుందని వారి నుంచి రక్షణ కల్పించాలని బాధిత దంపతులు లక్ష్మీదేవి, రమేష్‌బాబు మొరపెట్టుకున్నారు. వారు బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తాము జీవనోపాధి కోసం కానిస్టేబుల్ మౌనిక వద్ద రూ. లక్ష అప్పుగా తీసుకున్నా మన్నారు. అయితే వారు వడ్డీ వ్యాపారం పేరుతో రూ. 85 వేలు అప్పుగా ఇచ్చి, విడతల వారీగా సుమారు రూ. 2 లక్షల వరకూ వసూలు చేశారన్నారు. ఇటీవల ఆరోగ్య పరిస్థితులు బాగోలేక కంతులు కట్టలేకపోయామన్నారు. దీంతో కానిస్టేబుల్ మౌనిక భర్త మల్లి తమను చెప్పలేని మాటలతో మానసిక వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. దుర్భాషలాడుతూ వేధిస్తున్న కానిస్టేబుల్ మౌనిక, ఆమె భర్త మల్లిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ, డీఎస్పీలను కోరుతున్నట్లు తెలిపారు.

దేవాంగ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఉరవకొండ : చాలా రోజులుగా వివాదాస్పదమవుతోన్న ఉరవకొండ దేవాంగ సంక్షేమ సంఘం కళ్యాణ మండపం అధ్యక్షుడిని ఎట్టకేలకు ఎన్నుకున్నారు. పట్టణంలోని దేవాంగుల కళ్యాణ మండపంలో బుధవారం దేవాంగ కుల పెద్దమనుషుల కమిటీ ఆధ్వర్యంలో కటికం మల్లేష్‌ను నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం పెద్దలు చిట్టా శ్రీధర్, కొమ్మసాని బాలచంద్ర, రంగనాయకులు, ఎంసి.నాగభూషణం, మిడతల చంద్రమౌళి మాట్లాడుతూ నూతన పాలకవర్గం సభ్యులు కళ్యాణ మండపం అభివృద్ధికి కషి చేయాలన్నారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా కులస్తులు, పెద్దల అభిప్రాయాలు, సలహాలు పరిగణలోకి తీసుకొని అభివృద్ధి వైపు నడిపించాలన్నారు. నూతన అధ్యక్షుడు కటకం మల్లేష్‌ను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిమ్మల ప్రసాద్‌రెడ్డి, నాగరాజు, కొత్త మురళీకృష్ణ, చిట్టా రఘు, ఆర్‌సి.ప్రసాద్, దోనపర్తి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు 'అమ్మ' సంస్థ ఆర్థికసాయం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలో ఉన్న శ్రీమాతృశ్రీ అనాథ శరణాలయంలో ఉంటున్న శ్రీజ(7), స్వాతి(6)లను నగరంలోని 'అమ్మ సంస్థ' దత్తత తీసుకుంది. సోమందేపల్లికి చెందిన ఆ చిన్నారుల తండ్రి మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో తల్లి కూడా వారిని పోషించలేక రెండేళ్ల క్రితమే వదిలేసి వెళ్లిపోయింది. దీంతో గ్రామస్తులు వారిని అక్కడే ఉన్న శ్రీమాతృశ్రీ అనాథ శరణాలయంలో చేర్పించారు. ఆశ్రమం నిర్వాహకురాలు అరుణమ్మ విన్నపం మేరకు నగరంలోని అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి ఆ చిన్నారులను దత్తత తీసుకుని వారి దుస్తులు, నిత్యావసరాలు, పుస్తకాలు, యూనిఫారం, స్కూల్ ఫీజు కోసం బుధవారం రూ. 70వేలు అందజేశారు. భవిష్యత్తులో కూడా వారికి ఆర్థికంగా సాయం చేస్తామని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్‌యాదవ్

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-అనంతపురం

మార్చి 8వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు చేపట్టాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ కోరారు. శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో బిఎస్ఎన్ఎల్, ఏపీఎస్ఆర్టీసీ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మున్సిపల్, జిల్లా పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ గత జాతీయ లోక్ అదాలత్‌లో కంటే ఈసారి ఎక్కువ కేసులను పరిష్కారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ కోరారు. ఈ మేరకు బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్ సిఎస్.గుప్తాను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. జగదీష్ మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే జోన్ ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుంతకల్లు స్టేషన్‌లో యుద్ధప్రాతిపదికన 24 బోగీలు నిలిపే పిట్ లైన్లు, రైల్వే కోచెస్ మెయింటెనెన్స్ డిపోను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి గౌస్, మండల కార్యదర్శి రాము, ఎఐటియుసి పట్టణ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం నగరంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో ఎపిఎస్ ఆర్‌టిసి అనంతపురం రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి 65 మంది ఉద్యోగులు హాజరై రక్తదానం చేశారు. శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్లు లక్ష్మణ్ ప్రసాద్, శంకర్‌గౌడ్ పర్యవేక్షించారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని రక్తదాతలకు ఆపిల్ పండ్లు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో డా. రాజేంద్రప్రసాద్, డిపో మేనేజర్ పి.నాగభూపాల్ పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని సనప, మదిగుబ్బ, బి.యాలేరు, ఆత్మకూరు సచివాలయాలను బుధవారం అనంతపురం డిఎల్‌డిఒ లలితా బాయి సందర్శించారు. ఇంటింటి సర్వే, మిస్సింగ్ సిటిజన్, తదితర సర్వేలను పరిశీలించి, వీటిని ఈ నెల 14వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరైతే సర్వే చేయించుకోరో వారికి ప్రభుత్వ పథకాలు అందించడానికి సాధ్యం కాదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.లక్ష్మీనరసింహ, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఈఓఆర్‌డి కామక్క, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, రతి, బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డిఎల్‌డిఒ లలితబాయి

గుత్తి ఆర్ఎస్‌లో సైకో వీరంగం

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో బుధవారం నగ్నంగా తిరుగుతూ ఓ సైకో వీరంగం సృష్టించాడు. ఒంటిపైన దుస్తులు లేకుండా మెయిన్ బజార్‌లో తిరుగుతూ స్థానికులపై దాడులకు తెగబడ్డాడు. హిందూపురం నుంచి గుంతకల్లుకు వెళ్లే డెమో ప్యాసింజర్ రైలు నుంచి దిగిన గుర్తు తెలియని వ్యక్తి రైల్వే స్టేషన్‌లో యువతులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ప్రయాణికులు ఇచ్చిన సమాచారంతో ఆర్‌పిఎఫ్ పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలిస్తుండగా తప్పించుకొని గుత్తి ఆర్ఎస్‌లోకి చొరబడ్డాడు. అక్కడి ఆర్చి నుంచి మెయిన్ బజార్ వరకూ కనిపించిన వారిపై రాళ్లు, కర్రలతో దాడులు చేస్తూ పత్తికొండ రోడ్డు కూడలిలో రాళ్లతో బీభత్సం సృష్టించాడు. కొందరు యువకులు ఆ వ్యక్తిని పట్టుకొని బంధించేందుకు ప్రయత్నించగా వారిపై దాడులకు పాల్పడ్డాడు. సైకోని చూసి ప్రజలు పరుగులు పెట్టగా కొద్ది సమయం మెయిన్ బజార్ నిర్మానుష్యంగా మారింది. యువకులందరూ ముక్కుమూడిగా సైకోను పట్టుకొని దేహశుద్ధి చేసి బంధించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

పసుపుల శ్రీరామరెడ్డికి పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బుక్కరాయసముద్రం మండల ఇన్‌ఛార్జి పసుపుల శ్రీరామరెడ్డి జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. పసుపుల హనుమంత రెడ్డి, పసుపుల నారాయణరెడ్డి, కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య శ్రీరామరెడి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.



అభిమానులు, కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలు చేసుకుంటున్న శ్రీరామరెడ్డి

బాలింత మృతికి నివాళి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రసవానంతరం కార్డియాక్ అరెస్ట్‌తో బాలింత మృతి చెందింది. బ్రహ్మసముద్రం మండలం భైరవసముద్రం గ్రామానికి చెందిన రాయప్పగారి హనుమంతప్ప భార్య తిప్పమ్మ(32) సోమవారం నాడు కాన్పు నిమిత్తం అనంతపురం సర్వజనాసుపత్రికి వెళ్లింది. ప్రసవ సమయంలో ఈమెకు బిపి అధికంగా ఉండడంతో వైద్యులు మంగళవారం నాడు సిజేరియన్ ద్వారా కాన్పు చేయగా ఆడబిడ్డ పుట్టింది. ఇదే సమయంలో ఆమెకు ఇతర చికిత్సలు అందిస్తున్న సమయంలో కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందింది. బుధవారం ఉదయం ఆమె స్వగ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు. బాలింత మృతి విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, మాజీ ఎంపిపి మంజుల, వన్నూరుస్వామి, ఎంపీటీసీ భర్త లింగన్న, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈశ్వరప్ప, బోయ లక్ష్మన్న, ఆయకట్టు ప్రెసిడెంట్ బోయ వెంకటేశులు తదితరులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి టిడిపి తరపున అండగా ఉంటామని వారు తెలియజేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : బీఎస్పీ

ప్రజాశక్తి-రాయదుర్గం

అధికారం చేపట్టి 8 నెలలైనా ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు విమర్శించారు. సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చాక నిధులు లేవు, ఆర్థిక ఇబ్బందులు అంటూ మొసలికన్నీరు కార్చుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీకు తెలీదా అని ప్రశ్నించారు. మద్యం ధరలు 15 శాతం పెంచడం సంపద సృష్టి కిందకు వస్తుందా అన్నారు. విద్యుత్ ఛార్జీలను ఇప్పటికే రెండుసార్లు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం అని, ఇప్పటికీ నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయాలని బీఎస్పీ డిమాండ్ చేస్తోందన్నారు. బీఎస్పీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుందని చిందనూరు నాగరాజు తెలిపారు.

దౌర్జన్యంగా పంట ధ్వంసం

ప్రజాశక్తి-నార్పల

రస్తా విషయంలో బుధవారం మండలంలోని గంగనపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు రైతు పత్తిపాటి రామాంజనేయులుకు చెందిన బీర తోటను ధ్వంసం చేశారు. రైతు పత్తిపాటి రామాంజనే యులు తన 15 ఎకరాల పట్టా పొలంలో బీర పంట సాగు చేశాడు. అయితే మోహన్, శ్రీనివాసులు, చెన్నకేశవులు, వెంకటస్వామి, బాబు మరో 10 మందితో కలిసి జెసిబి వాహనం, వేటకొడవళ్లు తీసు కొచ్చి దౌర్జన్యంగా బీరపంటను ధ్వంసం చేశారని బాధిత రైతు వాపోయాడు. వారికి ఎలాంటి హక్కు లేనప్పటికీ రస్తా వదలాలని దౌర్జన్యం చేస్తూ పచ్చని పొలంతో పాటు డ్రిప్పు పరికరాలను జెసిబితో ధ్వంసం చేశారని, దీంతో రూ. 10 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. బాధిత రైతు పత్తిపాటి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ చేపడుతామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

మత సామరస్యంతో సమాజాభ్యున్నతి

ప్రజాశక్తి-అనంతపురం

మత సామరస్యంతో సమాజాభ్యున్నతి సాధ్యమవుతుందని అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ జేఎల్ మురళీధర్ తెలిపారు. ఈ నెల 28వ తేదీ నగరంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహిస్తున్న శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 6వ పీఠాధిపతి డా. ఉమర్ ఆలీషా 140వ జయంతి వేడుకల పోస్టర్‌ను మురళీధర్ బుధవారం నగరంలోని అర్బన్ బ్యాంకులో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. 'నేటి భారతదేశం–మత సామరస్యం' అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయం అన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు, మేధావులు, విద్యావంతులు ఆలీషా జయంతి వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డా. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు సుంకర రమేష్, విజయసాయి కుమార్, తోట నాగరాజు, సునీల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన సంజీవరాయుడు

ప్రజాశక్తి-యాడికి

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిని బుధవారం అనంతపురంలోని ఆయన నివాసంలో వైసిపి నూతన మండల కన్వీనర్ ఎం.సంజీవరాయుడు, మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సంజీవరాయుడు మాట్లాడుతూ మండల కన్వీనర్‌గా నియమించినందుకు వైసిపి అధినేత జగన్, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కేశవరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పామిడి

పట్టణంలోని భోగేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భోగేశ్వరస్వామి ప్రధాన ఆలయం, గోపుర నిర్మాణాన్ని బుధవారం దేవాదాయ శాఖ జోనల్ డిసి గురు ప్రసాద్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఆలయ ప్రహరీ, బండపరుపు కోసం నివేదిక పంపించామన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రాముస్వామి, పురుషోత్తంస్వామి అర్చన చేసి, ఆశీర్వచనం ఇచ్చారు. తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణయ్య, అర్చకులు చంద్రస్వామి, అనిల్‌స్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.